# నీతి

–నిశాపతి

టేబుల్ చుట్టూ వున్న నాలుగు కుర్చీల్లో కొంచెం మంచి కుర్చీ మీద నేను కూర్చుని వున్నాను. మిగతా మూడింటిలో మూర్తి, రావు, విశ్వం కూర్చుని వున్నారు. మేం నలుగురం ప్రభుత్వంలో పెద్ద ఉద్యోగులం. నేను అందరి కంటె పెద్ద ఆఫీసర్ని. మిగతా ముగ్గురూ నిచ్చెనలో నా కంటె ఒకే మెట్టు కిందివాళ్లు. నాకు కంపెనీ యిచ్చే అదృష్టం ఇవాళ ముగ్గురినీ వరించింది గాని బిల్లు చెల్లించే భాగ్యం మాత్రం ఎవరో ఒకరికే దక్కనుంది.

రాజకుమారుడిని ఉత్తరం దిక్కుకి వెళ్లొద్దని పేద రాశి పెద్దమ్మ చెబితే, వాడు ఖచ్చితంగా అటే వెళతాడు. అలాగే ఆంధ్రాలో సంపూర్ణ మద్యనిషేధం, మా నాలికలు పీకేలా చేసి, ఇదుగో, ఈ రాత్రి ఇలా బీదర్‌లో తెచ్చి పడేసింది.

ఇంతాచేసి ఉత్తుత్తి హడావిడే గాని మేమంతా క'బీరు' దాసులమే! మాలో డోస్ట'విస్కీ'లు, క'రమ్' చంద్ 'బ్రాందీ'లు ఎవరూ లేరు. ఈ 'పని' అయ్యాక జహీరాబాద్ గెస్ట్‌హావుస్‌కి వెళ్లి డిన్నర్ కొట్టేస్తాం.

ఓ రెండు గంటలపాటు వ్యంజనాలని అడ్డుపెట్టుకుని సీసాలు ఖాళీచేశాక, వెయిటర్ని బిల్లు తెమ్మన్నాం. ఇంతాచేసి బిల్లు తొంభై ఆరు రూపాయలే!

బిల్లు ఎంత తక్కువో చూశాక, చెప్పొద్దూ, నాలో కొంచెం 'నిజాయితీపరుడిని అనిపించుకోవాలి' అన్న కోర్కె రగిలింది. అందుకని, అందర్నీ గదమాయించి, ఓ నూరు రూపాయల నోటుని జేబులోనించి తీసి, బేరర్ తెచ్చిన ప్లేట్‌లో పడేశాను. అందరం లేవడానికి సిద్ధమవుతున్నాం.

సరిగ్గా అప్పుడే ఓ విచిత్రం జరిగింది.

బేరర్ నాలుగు వంద రూపాయల నోట్లూ, నాలుగు రూపాయల చిల్లరా పెట్టుకుని ప్లేటు వెనక్కి తెచ్చాడు.

మా వాళ్లకి మత్తు వదిలింది. 'చప్పున తీసేసుకోండి సార్" అన్నారు ఆత్రంగా.

నేను అదేమీ వినిపించుకోకుండా, 'బేరర్' అని పిలిచి, "నేను పడేసింది వంద రూపాయల నోటే. అయిందొందలది అనుకున్నావేమో!" అన్నాను.

బేరర్ క్యాషియర్ని సంప్రదించి వెనక్కి వచ్చి "థాంక్యూ సర్!" అంటూ ఆ నాలుగు వందలూ వెనక్కి తీసేసుకున్నాడు.

మా వాళ్లంతా, "యూ ఆర్ గ్రేట్ సర్!" అని అభినందించారు.

అయితే, నా మొహంలో సంతోషం బదులు విచారం ప్రవేశించింది. వెంటనే పరేంగితజ్ఞులైన మా వాళ్లు, "ఏంటి సార్, అలా వున్నారు?" అని పరామర్శించారు.

నేను కొంచెం రుద్ధ కంఠంతో, "ఇప్పుడు మీరు అందించిన అభినందనలు చెందాల్సింది నాకు కాదు" అన్నాను.

"మరి?"

"అవి చెందాల్సింది చిక్కడపల్లిలో తమలపాకులు అమ్ముకునే ఓ పదేళ్ల కుర్రాడికి" అన్నాను.

"ఇదేదో 'సర్దార్జీ – టాక్సీ డ్రైవర్' జోకులా వుంది సార్!" అన్నాడు విశ్వం. నా దగ్గర ఆపాటి చనువు తీసుకునేది అతనొక్కడే!

నేను గంభీరంగా తలెత్తాను. విశ్వం నవ్వు మొహంతో వున్నాడు. మిగతా వాళ్లిద్దరూ నవ్వితే నాకిష్టమో, నవ్వకపోతే నాకిష్టమో తేల్చుకోలేక 'మల్టిపుల్ ఛాయిస్' మొహాలు పెట్టి కూర్చున్నారు.

నేను నవ్వాను.

దానికోసమే ఎదురు చూస్తున్న వాళ్లలా, "ఆ కుర్రాడి కథేంటో చెప్పండి సార్!" అన్నారు అందరూ ముక్తకంఠంతో.

"పదండి! కారులో చెబుతాను!" అంటూ లేచాను. నేను లేవగానే అందరూ లేచారు.

కారులో కూచున్నాక కూడా వాళ్లు వదిలిపెట్టలేదు.

నేను కథ చెప్పడం మొదలెట్టాను.

○ ○ ○

సుమారు ఒక సంవత్సరం క్రితం సంగతి. ఆ రోజు ఉగాది. పనివాళ్లెవ్వరూ రాలేదు. అన్ని పనులూ నేనే చేసుకోవాల్సి వచ్చింది.

వాటిలో తమలపాకులు కొనడం గూడా ఒకటి.

నాకు ధరలు పెరుగుదల గురించి ప్రత్యక్ష పరిజ్ఞానం కొంచెం గూడా లేదు. అంతా 'మీడియా' పరిజ్ఞానమే!

సరే, నేను ఒక తమలపాకుల కట్ట చూపిస్తూ, 'అదివ్వు' అన్నాను – ఒక రూపాయి కాయిన్ ఇస్తూ.

వాడు కాసేపు నివ్వెరపోయాడు. తరువాత 'రూపాయికి రెండాకులు సార్!' అన్నాడు. పాతిక రూపాయలు ఇచ్చి యాభై ఆకులు తీసుకున్నాను.

దోపిడీ పెట్టుబడిదారుడే చేస్తాడని ఎవరన్నారు? కార్మికుడైనా చేస్తాడు నిక్షేపంలా! కావలసిందల్లా అవకాశం!

ఆ రోజునించీ నాకు బీదవాళ్ల మీద వుండే జాలీ, దయా నశించాయి.

ముఖ్యంగా తమలపాకులు అమ్మేవాళ్లని చూస్తే నాకు 'ఎలర్జీ' పుట్టుకురావడం మొదలైంది.

తరవాత కొన్నాళ్లకి ఇంకేదో చిన్న పండగ వచ్చింది. నేను చిక్కడపల్లి వెళ్తోంటే తమలపాకులు తెమ్మని పురమాయించింది మా ఆవిడ.

హోటల్లో టిఫిన్ చేసి బైటికి రాగానే అక్కడ కనిపించాడు ఓ కుర్రాడు తమలపాకులు అమ్ముతూ.

"తమలపాకులు పది కావాలి. ఎంత?" అని అడిగాను.

అప్పుడే మైకులో ఏదో ఆస్తి పన్ను ప్రకటన రావడం మొదలెట్టింది. ఆ హోరులో ఆ కుర్రాడు చెప్పింది స్పష్టంగా వినబడలేదుగాని, 'అయిదు' అన్న అంకె మాత్రం బాగా వినబడింది.

'హుం! ఆఫ్టరాల్ పది ఆకులు అయిదు రూపాయలు! దోపిడీ ఇంకా కొనసాగుతూనే వుందన్న మాట!"... నాకు కోపం కట్టలు తెంచుకుంది.

"నాకు పదిహేను ఆకులు కావాలి. ఎంతకిస్తావ్?" అన్నాను క్వాంటిటీ పెంచితే రేటు తగ్గిస్తాడేమోనని.

"మూడు రూపాయలు" అన్నాడు వాడు.

నాకు కొంచెం ఆశ్చర్యం వేసింది. వాడు చెప్పిన లెక్కయినా ఏడున్నర కావాలి. పోనీ, కొంచెం తగ్గించాడనుకుంటే ఏడు రూపాయలవుతుంది.

బహుశా వాడు 'ఏడు' అంటే నాకు 'మూడు' అని వినిపించిందేమోనని సరిపెట్టుకున్నాను.

ఎందుకైనా మంచిదని ఒక అయిదు రూపాయల నాణెం వాడి చేతిలో పెట్టాను. వాడికి ఇంకా రావలిస్తే వాడే అడుగుతాడు.

## సకల అంగాలూ మాట్లాడుతాయి!

మాటలు
నోటి నుండే కాదు,
ముఖం నుండీ వెలువడుతాయి!
కళ్ళు, చెంపలు, నొసలు..
సకల అంగాలూ మాట్లాడుతాయి!
ఒక్కొక్కప్పుడు
గొంతు పెగలక పోవచ్చు
నోటికి తాళం బిగించుకోవచ్చు
అంత మాత్రాన భావం అభావమైపోదు!
మొద్దుబారిన మట్టి బుర్రలు కొన్ని
రాటుదేలిన గట్టి గుండెలు కొన్ని
దూషణల దుమారం చెలరేగిన
బాధేలేనట్లు, అసలేమీ కానట్లు
చిరు దరహాసాలు ఒలకబోసినా
లోలోన కొట్టుకోవా?
ఉమ్మేస్తే తుడిచేసుకోనూ
రాజకీయం నేర్పనోళ్ళం కదా!?

ఈ మనసు
ఎంత కోమలం!
చిన్న రాయి తాకిడికే
అలలై విలవిల్లాడే కొలనులా
విచక్షణాలేమిలోంచి జారిపడే మాటను
అసలే భరించలేదు!
గాయపడ్డ గుండె దుఃఖాన్ని స్రవిస్తుంది!
ఆగ్రహ జ్వాలలు వెదజల్లుతుంది!

అమాయకపు భక్తిభావమో
ఆవహించిన ఒట్టి పిరికితనమో
నమిలి మింగేసే జొరాసిక్ రాక్షస స్వరూపమో
ఉబికి వచ్చే మాటలకు అడ్డంపడ్డా
ఎద లోతుల్లో
మసిలే కన్నీళ్ళ సెగలు
రగిలే కడుపు మంటల పొగలు
అనుక్షణం బయటపడేవే!
మానవ అంగాలన్నీ మాట్లాడేవే!

లోచూపుకు కాస్త పదునుపెట్టుకొని
హృదయంతో హృదయాన్ని అనుసంధానించుకొని
కాసింత మనసుపెట్టి వింటే
మూగభాషలన్నీ అర్థమయ్యేవే!
మౌన ఘోషలన్నీ అర్థమయ్యేవే!

–ఏలేశ్వరం వెంకటేశ్

వాడు ఏమీ అడగలేదు సరిగదా తిరిగి నా చేతిలో ఒక నాణెం పెట్టాడు.

నాకు అర్థం అయింది. వాడు తన తప్పు గుర్తించ లేదు. తనకి రెండు రూపాయలు రావలసి వుండగా నాకు రెండు రూపాయలిచ్చాడు.

ఒక్క క్షణం వాడికి లెక్క వివరంగా చెప్పి మిగిలిన డబ్బులు ఇచ్చేద్దాం అనుకున్నాను. కాని అంతలో ఉగాది నాడు నేను గురైన దోపిడీ గుర్తొచ్చింది. పట్టు దల ఆ చిన్న మొత్తం గురించి కాదు–

"వాళ్లకి అవకాశం ఏ కాస్త దొరికినా వాళ్లు దోచు కోగా లేనిది మనకి అవకాశం వచ్చినప్పుడు మనం ఎందుకు వదిలిపెట్టాలి?" అని! అంతే!–

మాట్లాడకుండా వాడిచ్చిన కాయిన్ జేబులో వేసుకుని కదిలాను.

నాలుగడుగులు వేశానో లేదో, వెనకనించి, "సార్! సార్! ఓ సారూ!" అని కుర్రాడి కేకలు వినిపించాయి.

నేను విననట్లే నటించాను. ఇంత కాలానికి నా వర్గ శత్రువు నాకు దొరికాడు. ఎందుకు వదలాలి?

ఆటో కోసం చూస్తూ నిలబడ్డాను. వాడు మెల్లిగా నా వైపు అడుగులు వేయడం మొదలెట్టాడు.

నాకు ఒళ్లు మండుకొస్తున్నది. 'వాడిని ఎట్లా చిత్తు చేయాలా?' అని నా బుర్ర అప్పుడే పథకాలు రచించు కోడం ప్రారంభించింది.

వాడు ఏమైనా గొడవపెడితే వాణ్ణే మోసగాడిగా చిత్రీకరించి, బాగా తిట్టి, పక్కవాళ్లతో గూడా చీవాట్లు పెట్టించడానికి ప్రణాళికలు వేసుకుంటున్నాను, మనసు లోనే.

ఇంతలో వాడు నాకు దగ్గరిగా వచ్చేసి, "నువ్వు పదైదాకులు తీసుకున్నవ్ గద సారూ?" అన్నాడు.

నేను వీలైనంత కఠినంగా, "అవును, ఏం?" అన్నాను.

"నేనెంత జెప్పిన?" అన్నాడు వాడు.

నేను అనుకున్నదే అవుతోంది. నాకు కోపం ముం చుకొచ్చింది. గట్టిగా గొంతు పెంచి, "నువ్వు మూడు రూపాయలు చెప్పావ్. నేను అయిదు రూపాయల కాసు ఇచ్చాను. నువ్వు వెనక్కి రెండు రూపాయల నాణెం ఇచ్చావ్. సరిపోయింది. ఇప్పుడు మళ్లీ ఏం పేచీ పెట్టా లని వచ్చావ్?" అన్నాను.

"పేచీ ఏమిటికి బెడత సార్? రూపాయికి అయి దాకులు చెప్పిన! పదైదాకులకి మూడు రూపాయలవు తది. నువ్వు అయిదిచ్చినవ్. నీకు రెండ్రూపాయలు వాపస్ వస్తది. కాని సారూ, నేను నీకు రెండు రూపా యల సిక్క యియ్యలే! గలత్‌ల ఒక్క రూపాయి సిక్కనే ఇచ్చిన. ఇంకో రూపాయి నీకే వస్తది. అది యీయనికే అచ్చిన! ఇగో తీస్కో! ఏమనుకోకు సారూ!" అంటూ ఒక రూపాయి నాణెం నా చేతిలో పెట్టి వెళ్లిపోయాడు.

నాకు లోలోపల చాలా దుఃఖం, అవమానం, సిగ్గూ కలిగాయి. తమలపాకులు అమ్ముకుని బతికే ఓ చిన్న పిల్లవాడిని మోసం చెయ్యాలన్న ఆలోచన వచ్చినందుకు దుఃఖం, అందులో గూడా ఓడిపోయినందుకు అవమా నం, వాడి మాత్రం నిజాయితీ నాకు లేనందుకు సిగ్గూ – అన్నీ ఒక్కుమ్మడిగా కలిగాయి.

ఆ క్షణంలో ఆ కుర్రాడే నా పాలిటి బోధివృక్షం అయ్యాడు. దాని ఫలితమే ఇందాక బార్‌లో మీరు చూసిన సీను!" అన్నాను నేను కథ ముగిస్తూ. ■

## నాన్న

చితికిపోతూ  
నీడనిచ్చే వృక్షంలా...  
కరిగిపోతూ  
వెలుగునిచ్చే కొవ్వొత్తివా...  
అమృతం పంచి  
అన్నివిధాలా...  
ఆదరించి  
ఆదుకునేవాడు నాన్న!  
పసితనంలో...  
బుడి బుడి  
అడుగులతో  
తడబడు వేళ  
నడక నేర్పి  
నడిపించేది నాన్న!  
సముద్రమంతా  
గంభీరత్వం...  
వెన్నెలలాంటి  
మనసు...  
కలగలిపితే  
కనిపించేది నాన్న!

–దాస్యం సేనాధిపతి